# అబ్బ...ఎన్నాళ్ళకు చూశానండి బాబూ!

చోడిశెట్టి శ్రీనివాసరావు



**అ**నంతరావుకి నవ్వొచ్చింది ! ఎందుకంటే.......

ఇరవై నిమిషాల క్రితం నగరం నడిబొడ్డున నాగేంద్రుడి గుడి దగ్గరున్న రావిచెట్టు నీడలో నిలబడి ఆటో కోసం చూస్తున్నాడతను. ఒకదాని వెనుక ఒకటిగా ఆటోలు వస్తూనే ఉన్నా ఎవరూ ఆగడం లేదు. అతి కష్టమ్మీద ఆగిన వాళ్ళిద్దరు – ముగ్గురు అనంతరావు శ్రీరామనగర్ అని చెప్పగానే అటువైపు పోవడం లేదంటూ వెళ్ళిపోయారు. అలాగని శ్రీరామనగర్ ఏమారుమూలనో లేదు, టౌను రైల్వేస్టేషన్ వద్ద నుంచి ఎడమ వైపుకి తిరిగి నాలుగు కిలోమీటర్లు లోపలి కెళ్ళాలంతే ! ....

ఇంతకు ముందయితే వాళ్ళ ప్రాంతం నుంచి నగరంలోకి రావడానికి – పోవడానికి పావుగంటకో సిటిబస్సు ప్రత్యక్షమయ్యేది. ఆటోలు రంగప్రవేశం చేశాక జనం సిటిబస్సులు ఎక్కడం మానేశారు. దాంతో ఆ బస్సులన్నీ నిలిపివేశారు. సైకిళ్ళు మోటారు వాహనాలు ఉన్నవాళ్ళను మినహాయిస్తే మిగిలిన వాళ్ళంతా ఆటోల మీద ఆధారపడక తప్పడం లేదు. ఆటో దొరికితే అతను ఇల్లు చేరడానికి అరగంట కన్న ఎక్కువ సమయం పట్టదు. వచ్చేటప్పుడు రోడ్డుమీదికి రాగానే ఆటోదొరికింది. మరిప్పుడేమిటిలా ? ....

నిజానికి అనంతరావు అక్కడి వరకు రావాల్సిన పనిలేదు. అతనుండే చోట దొరకని వస్తువు లేదు. అయితే కీళ్ళనొప్పులు తగ్గడానికి – ప్రతినెలా ఎనిమిదో తేదీన వేరే ఊరు నుంచి ఓ డాక్టరుగారొచ్చి నగరం మధ్యనున్న నీలిమ లాడ్జిలో దిగి కావాల్సిన వాళ్ళందరికీ మందిస్తారు. కీళ్ళనొప్పులతో బాధపడుతున్న అనంతరావు ఆమందు కోసం ఎప్పటిలాగే రాక తప్పలేదు.

సముద్ర కెరటాల్లా ఆటోలు వస్తూనే ఉన్నా అతన్ని గమ్యం చేర్చేవాళ్ళెవరూ కనిపించడం లేదు. మధ్యాహ్నం ఒంటిగంట కావస్తూందేమో కడుపులో ఆకలి కరకర మంటోంది. అసహనంతో, ఆకలితో అతను అతలా కుతల మవుతుంటే – ఆపద్బాంధవుడిలా వాళ్ళ ప్రాంతంలో ఉండే ఆటోవాలా ఒకతను రక్కున అనంతరావు ముందు ఆటోఆపి " ఇంటికేనా గురువుగారూ ?" అన్నాడు.

"ఔనయ్యా !" అన్నాడు నీరసంగా ఆనందరావు.

"నేనటే పోతున్నాను. ఎక్కండి మరి " అన్నాడు ఆటోవాలా.

"హమ్మయ్య, బతికించావురా నాయనా"! అనుకొంటూ ఆటో ఎక్కాడు అనంతరావు చిన్న బజారు వద్దకు ఆటోవచ్చాక ఆపమంటూ ఓ పోలీసాయన చెయ్యి ఊపాడు.

'ఈవేళప్పుడే ఈయనతో ముగ్గురు'......

ఎక్కడం... దిగడం...' ఆటోవాలా సణుక్కుంటూ ఆటోనాపాడు. తను కానుగ చెట్టు వరకు వస్తానంటూ ఆటోవాలా అంగీకారం లేకుండానే ఆటో ఎక్కి కూర్చున్నాడాయన.

పదినిమిషాల్లో కానుగ చెట్టు సెంటరొచ్చింది.

" ఇక్కడ ఆపవోయ్ !" అన్నాడు పోలీసాయన.

ఆటోను ఆపి ఆయన దిగీదిగటంతోనే తిరిగి పోనిస్తూంటే " ఆగవోయ్..ఆగు.." అన్నాడు బిగ్గరగా పోలీసాయన.

చిరాకుపడుతూ అప్పటికే కాస్త ముందుకెళ్ళిన ఆటోకు బ్రేక్ వేశాడు ఆటోవాలా. పోలీసాయన నాలుగడుగుల్లో అక్కడికొచ్చి " ఏమిటయ్యా ఆతొందర?..." అని జేబులోంచి అయిదు రూపాయల నోటుతీసి ఆటోవాలా చేతిలో పెట్టి వడివడిగా వెళ్ళిపోయాడు.

ఆటోవాలా మహా ఆశ్చర్యంతో ఉబ్బితబ్బిబ్బవుతూ ఇంత మొహం చేసుకొని " అబ్బ... ఎన్నాళ్ళకు చూశానండి బాబూ!...డబ్బులిచ్చిన పోలీసాయన్ని!!" అన్నాడు.

అదిగో, ఆమాటలకే అనంతరావుకి నవ్వొచ్చింది. ★


**పాఠకులకు, ఏజెంటులకు విజ్ఞప్తి**

**'చినుకు'** మాసపత్రిక కొరకు పంపవలసిన చందాలను, డిపాజిట్లను మీ దగ్గరలో ఉన్న ఆంధ్రాబ్యాంక్ శాఖలలో **చినుకు సాహిత్య మాసపత్రిక, గాంధీనగర్. C.A. No. 3694 లో** చెల్లించవచ్చు. దీనికి ఎటువంటి ఛార్జీ వసూలుచేయబడదు.


## 'చినుకు'

చినుకు చినుకు కలసి
వానవుతుంది
భూమిమీద బుడగవుతుంది
నేలతల్లికి నేస్తమవుతుంది

చినుకు వర్షమై
వరదవుతుంది
నదులకు, చెరువులకు, సెలయేళ్ళకు
నీరవుతుంది
చిరుమువ్వల సవ్వడితో పుడమి తల్లికి
పులకింతవుతుంది

చినుకు ప్రకృతికి
ప్రాణమవుతుంది
మానవాళికి దాహం తీర్చే దాతవుతుంది
ఎండిపోతున్నమొక్కలకు
పచ్చని చిగురవుతుంది

చినుకు జంతువులకు
పశు పక్ష్యాదులకు
పరవశం అవుతుంది
ప్రాణి కోటికి సేద దీర్చే
జీవనాధారం అవుతుంది

చినుకు రైతు కంటి
తుడుపవుతుంది
వరిచేలకు వరమవుతుంది
చేలగట్లపై పల్లెపదుచుల
ఆనందానికి పాటవుతుంది

చినుకు కరువు చేసే
కరాళ నృత్యానికి
కళ్ళెం అవుతుంది
కరువు రక్కసినుండి
భూగోళాన్ని కాపాడుతుంది

**- కె.సి.లలిత**